
సాక్షి ఒడిశా

శనివారం । 26 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.3,30,803

- భువనేశ్వర్/పూరీ



భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

శ్రావణ మాసంలో ప్రధానమైన వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

- 8లో



నువాపడాలో మావోయిస్టుల దాడి

నువాపడా జిల్లా నువాపడా సదర్ మండలం కెర్మెలి పంచాయతీ పరిధిలోని గోలాబొంధా గ్రామంలో మావో దళాలు గురువారం రాత్రి అలజడి రేపాయి.

- 8లో

న్యూస్‌రీల్

ప్రసవ వేదన



గర్భిణి రజనీ మండగిని డోలిలో ఆస్పత్రికి తరలిస్తున్న గిరిజనులు

కొరాపుట్: రోడ్డు సదుపాయం లేకపోవడంతో గర్భిణిని డోలిలో ఆస్పత్రికి తరలించిన విషాదకర ఘటన జిల్లాలోని బందుగాం సమితిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బందుగాం సమితి కప్పలాడ పంచాయతీ రేవతి గుడ గ్రామానికి చెందిన రెంగు మండగి భార్య రజనీ మండగికి గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. అయితే గ్రామానికి రోడ్డు మార్గం లేకపోవడంతో అంబులెన్స్ వచ్చేందుకు అవకాశం లేకపోయింది. ఇక చేసేదేమీలేక గ్రామస్తులు ఒక కర్రకు చీరకట్టి డోలి మాదిరిగా చేసి అందులో రజనీని ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. కొంత దూరం వెళ్లిన అనంతరం ఒక ఆటోలో అలమండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ సమయానికి అక్కడ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో, బందుగాం సమితి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకి వైద్యం అందజేస్తున్నారు. బాధిత గ్రామానికి బందుగాం సమితి కేంద్రానికి రాకపోకలు సాగించడానికి రోడ్డు మార్గం లేదు. దీంతో గిరిజనులు ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా మీదుగా బందుగాంకు రాకపోకలు సాగిస్తున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

కపిలేశ్వరాలయం సందర్శన

భువనేశ్వర్: రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధ మరియు పురాతన శైవ పీఠాల్లో ఒకటైన కపిలేశ్వర్ ఆలయాన్ని 'జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నం'గా కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఇటీవల ప్రకటించింది. ఆలయాన్ని భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ)కి అప్పగించిన తర్వాత సంరక్షణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ఏఎస్ఐ అధికారులు ఆలయాన్ని శుక్రవారం ప్రత్యక్షంగా సందర్శించారు. ఆలయ ప్రాంగణం మరియు గోడలను శుభ్రం చేయడం వంటి మౌలిక కార్యకలాపాలు చేపట్టారు. నిర్వహణ, సంరక్షణ, బావి కార్యాచరణ కోసం అనుబంధ వర్గాలతో సంప్రదించారు. ఆలయ సింహద్వారానికి ఉత్తరం వైపున ఉన్న మేఘనాథ ప్రాకారాన్ని ముందుగా శుభ్ర పరిచారు.

అక్టోబర్‌లో రాహుల్ గాంధీ రాష్ట్ర పర్యటన

- ఎమ్మెల్యే అధిరాజ్ పాణిగ్రాహి


భువనేశ్వర్: అక్టోబర్ నెలలో రాహుల్ గాంధీ రాష్ట్ర పర్యటనకు రానున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అధిరాజ్ పాణిగ్రాహి తెలియజేశారు. అలాగే ప్రియాంక గాంధీ సైతం అక్టోబర్‌లో వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. రాష్ట్రానికి చెందిన 5 మంది ఎమ్మెల్యేలు రాహుల్ గాంధీని న్యూఢిల్లీలో కలిశారని, ఒడిశా పర్యటనపై చర్చించారని ఆయన వివరించారు. రాహుల్‌తో చర్చ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ స్థితిగతులపై సవివరంగా ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని 4 జోన్లలో సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతిపాదించింది. అక్టోబర్ చివరి వారంలో ఒడిశాకు వచ్చేందుకు రాహుల్ అంగీకరించారు. అయితే ఓపీసీసీ అధ్యక్షుడితో చర్చించి రాహుల్ రాష్ట్ర పర్యటన తుది తేదీ ఇతర కార్యక్రమాల్ని ఖరారు చేస్తారన్నారు.

ఐదేళ్ల తర్వాత

2019వ సంవత్సరంలో రాహుల్ గాంధీ రాష్ట్రంలో పర్యటించారు. సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని ప్రచారం కోసం అప్పట్లో విచ్చేశారు. ఎన్నికల్లో గెలుపు లక్ష్యంతో పార్టీ అభ్యర్థులు, ఓటర్లను ప్రభావితం చేసే దిశలో పూర్తి పర్యటన కొనసాగింది. ఈసారి పర్యటన పూర్తి విభిన్నంగా ఉంటుందని భావిస్తున్నారు. పార్టీ పటిష్టత, కార్యకర్తల్లో అంకితభావం ప్రేరణ వగైరా అంశాలతో పార్టీ వర్గీయులతో లోతుగా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. రాహుల్ గాంధీ పర్యటనపై రాష్ట్ర కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది.

జ్వర భద్రం

భువనేశ్వర్: రాష్ట్రంలోని 30 జిల్లాల్లో డెంగీ విజృంభిస్తోంది. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం తీవ్రత అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ పరిస్థితి సెప్టెంబర్ వరకు ఉంటుందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ మిశ్రా తెలిపారు. చికిత్స కోసం ఆస్పత్రిలో చేరుతున్న రోగుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. రాష్ట్ర రాజధాని నగరంలో డెంగీ ప్రబలత అధికం కావడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. డెంగీ తీవ్రత ఉగ్రరూపం దాల్చక ముందే నివారణ, నియంత్రణ, చికిత్స, వైద్య సదుపాయాలను పటిష్టపరచాలని ప్రజలు కోరుతున్నారు. ప్రాణాంతకమైన డెంగీ వైరస్–2 (డెన్ 2) కారణంగా చికిత్స కోసం ఆస్పత్రిలో రోగులు పెరుగుతున్నారని వైద్య శాస్త్రవేత్తలు మరియు ఆరోగ్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



డెంగీ తీవ్రత

వ్యాధి తీవ్రత మరియు ప్లేట్‌లెట్స్ కౌంట్ పడిపోవడం వలన ప్రతిరోజూ 12 మంది పైబడి ఆస్పత్రుల్లో చేరుతున్నారు. దైనందిన నమూనా పరీక్షల్లో 70 వరకు పాజిటివ్ కేసులు ఖరారవుతున్నాయి. వీరిలో తీవ్రస్థాయి పీడితులు నిత్యం సగటున 12 మంది వరకు ఆస్పత్రి పాలవుతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలో రెండు డెంగీ వార్డులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

డెంగీ 4 రకాలు

నాలుగు రకాల డెంగీ ప్రబలత నమూనా పరీక్షల్లో నిర్ధారణ అవుతోంది. డెంగీ వైరస్ సెరోటైప్‌లు–డెన్ 1, డెన్ 2, డెన్ 3 మరియు డెన్ 4 ఉన్నాయని నిపుణులు పేర్కొన్నారు. వీటిలో డెన్ 2 అత్యంత ప్రాణాంతకంగా పరిగణించబడుతుందని పేర్కొంటున్నారు. డెన్ 2 వేరియంట్ సోకిన రోగులలో ప్రమాదకర డెంగీ హెమరేజిక్ జ్వరం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇది అంతర్గత రక్తస్రావం మరియు ముఖ్యమైన అవయవాలను ప్రభావితం చేస్తుంది. రోగం తీవ్రత అధికమై తరచుగా ఆస్పత్రిలో చేరాల్సిన పరిస్థితుల్ని ప్రేరేపిస్తుంది.

సమగ్ర విశ్లేషణ

రాష్ట్రస్థాయిలో డెంగీ విస్తరణ, తీవ్రత నేపథ్యంలో ఆర్‌ఎంఆర్‌సీ సమగ్ర విశ్లేషణ చేపట్టింది. రాష్ట్రంలో 18 జిల్లాల నుంచి సేకరించిన డెంగీ పాజిటివ్ నమూనాలను ఈ సంస్థ వైజ్ఞానికంగా విశ్లేషించింది. కొన్ని జిల్లాలు మినహా అత్యధిక ప్రాంతాల్లో డెన్ 2 సెరోటైప్ ప్రాబల్యం అధికంగా ఉన్నట్లు తేలింది. తాజా విశ్లేషణలో డెంగీ విస్తరణ, వ్యాప్తి శైలిని గుర్తించారు. దీని ప్రకారం స్త్రీల కంటే పురుషులు అధికంగా డెంగీతో ప్రభావితమవుతున్నారు. మూడింట రెండు వంతుల మంది పురుషులు డెంగీ బారిన పడుతున్నారు.

రక్త మార్పిడి సంక్లిష్టం

డెంగీ తీవ్రత రోగుల్లో రక్త మార్పిడి కష్టతరంగా పరిణమిస్తోంది. చికిత్స అనంతరం పీడితులు కోలుకోవడం కొంత మేరకు కష్టతరం అవుతుంది. ఇటీవల కాలంలో డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతున్నట్లు తెలుస్తుంది. లోగడ దైనందిన పాజిటివ్ కేసుల నమోదు 100 కాగా ఇటీవల కాలంలో ఈ సంఖ్య 70 నుంచి 74కి పరిమితం అవుతుందని ఆరోగ్య అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,737 కేసులు ఉన్నాయి. వీటిలో ఖుర్దా జిల్లాలో అత్యధికంగా 1,332 కేసులు నమోదయ్యాయి. అందులో 90 శాతం భువనేశ్వర్ నగరానికి చెందినవారు కావడం కలవరపరుస్తుంది.

డెన్ 2 విస్తరణ అధికం

డెంగీ వ్యాప్తిలో డెన్ 2 వైరస్ విస్తరణ అధికంగా ఉన్నట్లు నమూనా పరీక్షల నివేదికల విశ్లేషణ స్పష్టం చేస్తుంది. ఈ నివేదికలో డెంగీ వైరస్ సెరోటైప్–2 (డెన్ 2) అత్యధికంగా నమోదు అవుతుండగా డెన్ 1 మరియు డెన్ 3 నామమాత్రంగా నమోదు అవుతున్నట్లు స్థానిక ప్రాంతీయ వైద్య పరిశోధనా కేంద్రం (ఆర్‌ఎంఆర్సీ) పరిశోధక వర్గాల సమాచారం. స్థానిక మరియు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల రోగుల నుండి సేకరించిన నమూనాలలో ఈ వివరాలు కనుగొన్నారు. 70 శాతం నమూనాల పరీక్షల్లో డెన్ 2 ఖరారైనట్లు స్థానిక ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం డైరెక్టర్ సంఘమిత్ర పతి తెలిపారు. 28 శాతం శాంపిల్స్‌లో డెన్ 1 కనుగొనబడింది.

దోమకాటుతో ఇబ్బంది

డెంగీకు నిర్దిష్ట చికిత్స లేదు. ఈ ముప్పును నియంత్రించడానికి ఏకైక మార్గం దోమ కాటును నిరోధించడమేనని ఆరోగ్య శాఖ సీనియర్ అధికారి తెలిపారు. ఈ పరిస్థితుల్లో పౌర సంస్థల అధికారులు మరియు ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమకాటు నివారణకు దోమ తెరలు వాడాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తే డెంగీ తీవ్రత తగ్గుతుందని పేర్కొన్నారు.

సెప్టెంబర్ వరకు డెంగీ తీవ్రత: ప్రజారోగ్య శాఖ డైరెక్టర్

రాష్ట్రంలో డెంగీ తీవ్రత సెప్టెంబర్ నెల వరకు కొనసాగుతుంది. ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం స్థానిక క్యాపిటల్ ఆసుపత్రి కిక్కిరిసిపోతుంది. ఈ నేపథ్యంలో మరికొన్ని చోట్ల డెంగీ పరీక్షల శిబిరాలు ప్రారంభిస్తున్నట్లు ప్రజా ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ మిశ్రా తెలిపారు. స్థానిక నగర సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (యూసీహెచ్‌సీ) డెంగీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మరో 2, 3 రోజుల్లో ఈ కేంద్రాల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు ప్రారంభిస్తారు. స్థానిక క్యాపిటల్ ఆస్పత్రి, ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం (ఆర్‌ఎంఆర్సీ) డెంగీ పరీక్షలు నిర్వహిస్తాయి. డెంగీ నిర్ధారణ అయిన తర్వాత ఈ సంస్థల్లో చికిత్స చేపడతారు.

వృద్ధురాలి గొంతుకోసి హత్య



తొరాపుట్ గ్రామంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



శోశి ప్రధాన్ మృతదేహం

జయపురం: సబ్ డివిజన్ కుంద్రా సమితి బానువగుడ పంచాయతీ తొరాపుట్ గ్రామంలో ఘోరం జరిగింది. గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన 73ఏళ్ల వృద్ధురాలిని దుండగులు గొంతుకోసి హత్య చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఎంతోకాలంగా మృతురాలు శోశి ప్రధాన్, ఆమె భర్త రఘు ప్రధాన్‌లు గ్రామంలోని ఒక పూరి గుడిసెలో నివాసముంటున్నారు. వారి ముగ్గురు కుమారులు తనామ, ఉబాష్, మొనొలు తమతమ భార్యా, పిల్లలతో వేరువేరుగా ఉంటున్నారు. గురువారం ఉదయం రఘు ప్రధాన్ జయపురం సమితి డొంగాగుడలో ఉంటున్న తన కుమారుడు సుభాష్ ఇంటికి సైకిల్‌పై వెళ్లాడు. అక్కడే మధ్యాహ్నం భోజనం చేసి సాయంత్రం తిరిగి తమ గ్రామానికి వచ్చాడు. అనంతరం ఇంటిలోకి వెళ్లగా రక్తపు మడుగులో భార్య పడి ఉండడం చూచి నివ్వెరపోయాడు. వెంటనే గ్రామస్తులను పిలిచి, తన ముగ్గురు కుమారులకు కబురు చేశాడు. వారు వచ్చిన వెంటనే కుంద్ర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారి దీపాంజళి ప్రధాన్ పోలీసులతో గ్రామానికి చేరుకున్నారు. కొరాపుట్ నుంచి దర్యాప్తు బృందం శుక్రవారం ఉదయం గ్రామానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించింది. అయితే ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో వెనుదిరిగింది. విషయం తెలిసిన జయపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారి హరిష్ బీసీ గ్రామంలో దాదాపు మూడు గంటలు విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుంద్ర కమ్యూనిటీ వైద్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

816 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన నిందితులు, గంజాయిని చూపిస్తున్న పోలీసులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ అడవ పోలీసుస్టేషన్ పరిధిలోని వాలిపంక వద్ద శుక్రవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక పికప్ వాహనాన్ని నిలిపి తనిఖీలు చేయగా అందులో పెద్ద ఎత్తున గంజాయి బయటపడింది. జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ ఆదేశాల మేరకు అడవ ఎస్ఐ భాగ్యలత దాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో దాదాపు 816 కిలోల 100 గ్రాముల గంజాయి పట్టుబడింది. దీని విలువ మార్కెట్‌లో దాదాపు రూ.82 లక్షలు ఉంటుందని అంచనా. పోలీసుల దాడిలో నిందితులు మ్యాక్స్ పికప్ వ్యానుతో సహా రెండు బైకులు వదిలి పారిపోతుండగా పట్టుకుని మోహనా కోర్టుకు తరలించారు. కేసును అడవ పోలీసు ఎస్ఐ దాస్ విచారిస్తున్నారు.

మంత్రి రణేంద్ర ప్రతాప్‌పై కేసు కొట్టివేత



భువనేశ్వర్: బిజూ జనతా దళ్ సీనియర్ నేత, రాష్ట్ర వ్యవసాయ, రైతు సాధికారత విభాగం మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయికు వ్యతిరేకంగా దాఖలైన క్రిమినల్ కేసును రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. 2016 సంవత్సరంలో రైలు రవాణా అడ్డుకున్న ఘటనకు సంబంధించి మంత్రికి వ్యతిరేకంగా క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అంగుల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ (జేఎంఎఫ్‌సీ) కోర్టులో మంత్రికి వ్యతిరేకంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ ప్రొసీడింగ్ చెల్లుబాటు కాదని జస్టిస్ గౌరీ శంకర్ శతపతితో కూడిన సింగిల్ జడ్జి బెంచ్ ఆదేశించింది. నిర్ధారిత చట్టపరమైన కాల పరిమితి (2 ఏళ్లు) అధిగమించిన తర్వాత విచారణ చట్టబద్ధం కాదని ఈ ధర్మాసనం అభిప్రాయపడింది. చట్టబద్ధమైన వ్యవధి తర్వాత నేరాన్ని గుర్తించి న్యాయం పొందేందుకు న్యాయస్థాన ప్రక్రియను దుర్వినియోగం చేయడం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో క్రిమినల్ ప్రొసీడింగ్ న్యాయబద్ధం కాదని కోర్టు పేర్కొంది.

ఇదీ విషయం

ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం అఠొగొడొ నియోజకవర్గంలో మహానదిపై బ్యారేజీని నిర్మించడాన్ని వ్యతిరేకించి ఎమ్మెల్యే రణేంద్ర ప్రతాప్ స్వంయి ఆందోళనకు దిగారు. తన మద్దతుదారులతో కలిసి 2016 సంవత్సరం ఆగస్టు 3న రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ నేరం కింద రైల్వే పోలీసులు ఆయనపై రైల్వే చట్టం–1989 సెక్షన్ 174 (ఎ) కింద 2019 జూలై 9న కేసు నమోదు చేశారు. సుందర్‌గఢ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఢెంకనాల్ పోలీసులు క్రిమినల్ ప్రొసీడింగ్‌లను ప్రారంభించారు. ఢెంకనాల్ మరియు మరికొన్ని జిల్లాలకు చెందిన ఎంపీలు మరియు ఎమ్మెల్యేలకు సంబంధించిన నేరాలకు సంబంధించిన కేసుల విచారణ చేపట్టే అంగుల్ ప్రథమ శ్రేణి జుడిషియల్ మేజిస్ట్రేటు కోర్టు (జేఎంఎఫ్‌సీ)కి నోటీసై చేశారు. తదనుగుణంగా కేసును బదిలీ చేశారు. దీంతో 2021 సంవత్సరంలో మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయి హైకోర్టును ఆశ్రయించారు, సుందర్‌గడ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం కేవలం నేరాన్ని గుర్తించి, నిందిత పిటిషనర్ విలువైన హక్కులను విస్మరించి ప్రొసీడింగ్సు ప్రక్రియను జారీ చేయడం సవరించలేని తప్పిదంగా రాష్ట్ర హైకోర్టు అభిప్రాయపడింది.

బైకు చోరీ



బైక్ దొంగతనం చేస్తున్న యువకులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ పోలీసుస్టేషన్ పరిధి లిమ్మామెడ గ్రామంలో సుకాంత్ గొడొ అనేవ్యక్తి బైకు చోరీకి గురయ్యింది. ఈ మేరకు బాధితుడు గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఆ పరిసర ప్రాంతంలోని సీసీ కెమెరాలు పరిశీలించగా ఇద్దరు యువకులు బైకు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత కొద్ది నెలలుగా ఈ ప్రాంతంలో బైకు దొంగతనాలు విరివిగా జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బైజల్ గెడ్డ సందర్శన



బైజల్ గెడ్డను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పర్లాకిమిడి: బైజల్ గెడ్డపై రిజర్వాయర్ నిర్మించి కాశీనగర్, పర్లాకిమిడి ప్రాంతాలకు సాగునీరు అందించాలని 1990లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత బిజూ పట్నాయక్ సంకల్పించారు. పర్లాకిమిడి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి దారపు లచ్చన్న నాయుడు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సర్వే, డీపీఆర్‌లు అప్పట్లో ప్రభుత్వానికి పంపించారు. అయితే అక్కడ నివాసముంటున్న హొన్నాలీ జగన్నాథపురం, బైజల్ తదితర గ్రామస్తులు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకోవడంతో అంతటితో ఆగిపోయింది. దీంతో ప్రస్తుత బీజేడీ నాయకుడు, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, తిరుపతి పాణిగ్రాహి, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, ఎన్ఏసీ చైర్మన్ మేడిబోయిన సుధారాణి, చిన్ననీటి పారుదల శాఖ ఇంజినీరు, కాశీనగర్ బీడీవో తండి బైజల్ గెడ్డను గురువారం సందర్శించారు. బి.సీతాపురం పంచాయతీలో పలు ఎకరాల భూములకు సాగునీరు అందించడానికి కాలువలు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసి డీపీఆర్‌లు రూపొందించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు తెలియజేశారు. వారితో పాటు కాశీనగర్ సమితి బీజేడీ నాయకులు రొక్కం సతీష్, ఇతర సమితి సభ్యులు ఉన్నారు.

పొద్దుగూడకు నాయకుల క్యూ



గ్రామంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తాగునీటి బోరు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభుజానీ తదితరులు

కొరాపుట్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చిన్నారి సోనాలి దాస్ ఏక పాత్రాభినయంతో రాష్ట్రంలో సంచలనంగా మారిన పొద్దుగూడ గ్రామానికి అధికారులు క్యూ కడుతున్నారు. లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజాని గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. గ్రామంలో గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకున్నారు. తక్షణమే గ్రామానికి యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందేటట్లు చేస్తామని ప్రకటించారు. వారు పడుతున్న ఇబ్బందులు ఇంటింటికీ వెళ్లి తెలుసుకున్నారు. అనంతరం కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దుర్గా శంకర్ సాహు నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. బాలిక చెప్పినట్లు గ్రామంలో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రకటించారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

సాలూరు: పట్టణంలోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా ఇద్దరు వ్యక్తులు గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. జీగిరాం గ్రామం నుంచి సాలూరుకు ద్విచక్రవాహనంపై వస్తున్న రామభద్రపురం మండలం కొట్టక్కి గ్రామానికి చెందిన ఆదినారాయణ, సాలూరు నుంచి జీగిరాం వెళ్తున్న పాచిపెంట మండలం పెదచీపురువలస గ్రామానికి చెందిన రవి బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరూ గాయపడగా 108లో సాలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదినారాయణను విజయనగరం ఆస్పత్రికి తరలించారు.

దాడిలో వ్యక్తికి ..

పార్వతీపురం: పొలం పనిలో జరిగిన వాగ్వాదంలో దాడి చేయడంతో గాయాలైన ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం వనజ గ్రామానికి చెందిన జన్ని మాధవరావు వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఎ.కేశవరావు పొలంలో ఆకుకట్టలు వేయడానికి మాధవరావు, ఆరిక తిరుపతిరావు, పాలక మోహనరావు, మరికొంతమంది కూలి పనికి వెళ్లారు. అక్కడ పొలంలో అందరూ ఆకు కట్టలను పొలం చుట్టూ విసిరే క్రమంలో కట్టలు అటు విసరకు, ఇటు విసురురా.. అని మాధవరావును అజామాయిషీ చేస్తూ ఆరిక తిరుపతిరావు చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తిరుపతిరావు ఆగ్రహించి రెండుచేతులతో మాధవరావును పిడిగుద్దులు గుద్ది, కింద పడవేసి తన్ని నిన్ను చంపివేస్తే నీకు దిక్కెవరంటూ భయపెట్టాడు. ఈ దాడిలో మాధవరావుకు గాయాలు కావడంతో బాధితుడి బావమరిది పోలిరాజు జిల్లా ఆస్పత్రికి తీసుకు రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె. కవిత

పార్వతీపురంటౌన్: మాదకద్రవ్యాల బారినుంచి సమాజాన్ని కాపాడాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురంలోని ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో మత్తు పదార్థాల వినియోగం తగ్గింపు, విముక్తి చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వశాఖ సౌజన్యంతో రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యమంలో సమాజం, యువత, ఆర్థిక వ్యవస్థపై మాదకద్రవ్యాలు చూపే ప్రభావంపై అవగాహన, మాదక ద్రవ్యాల వల్ల కలిగే చెడుప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత మాట్లాడుతూ నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలలో మాదక ద్రవ్యాలు ఒకటని, యువత వాటి బారిన పడకుండా కాపాడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అందుకుగాను ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి, డ్రగ్స్ ప్రభావిత జిల్లాలలో ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

విజయనగరంలో పునరావాలస కేంద్రం

శిక్షణలో సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన శిక్షకుడు ప్రకాశ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు అందజేయాల్సిన సదుపాయాలు, కుటుంబసభ్యుల సహకారంపై అవగాహన కల్పించారు. సీడ్ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ రాజు మాట్లాడుతూ మత్తుపదార్థాలకు బానిసైన వారికి విముక్తి కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో విజయనగరంలో పునరావాస కేంద్రం నిర్వహిస్తున్నామని, నెలరోజులు ఉచిత వసతి, చికిత్స అందిస్తామని కావున జిల్లాలో మత్తుపదార్థాలకు బానిసలైన వారిని ఈ కేంద్రాలకు తీసుకువచ్చి సేవలు పొందవచ్చని తెలిపారు. చికిత్స అనంతరం కూడా నిరంతరం వారిని పర్యవేక్షిస్తుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి.భాస్కరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి గయాజుద్దీన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొడితే కొట్టాలిరా.. గోల్ కొట్టాలి



క్రీడాకారులతో అధికారులు



పోటీలో తలపడుతున్న బాలికలు

మల్కన్‌గిరి సమితి పద్మగిరి పంచాయతీలో ఉన్న ఎస్‌ఎస్‌డీ హైస్కూల్‌లో మై స్కూల్ హాకీ–23 పోటీలను కలెక్టర్ విశాల్ సింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. గిరిజన యువతలో ప్రతిభను వెలికితీయడం కోసం పోటీలు నిర్వహించడం జరుగుతోందని అధికారులు తెలియజేశారు. పోటీల్లో 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారని జిల్లా క్రీడాధికారి ధృభ చరణ్ ముదులి వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని పేర్కొన్నారు. ఇక్కడ సత్తాచాటిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి ఎంపికల్లో ప్రాధాన్యమిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. – మల్కన్‌గిరి



పోటీల్లో పాల్గొనేందుకు హాజరైన బాలికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ విశాల్ సింగ్ తదితరులు

సకాలంలో పనులు పూర్తి చేయాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సింగ్, పక్కనే దాస్, ముదులి తదితరులు

- కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్

రాయగడ: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ ఆదేశించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం జిల్లా పరిషత్ సమీక్ష సమావేశాన్ని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సింగ్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్నటువంటి అన్ని పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించి చేపట్టిన వివిధ కార్యక్రమాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందాయా లేదా అనే విషయంపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ప్రశ్నించారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తున్న నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ 2023లో నిర్ధారించిన ఖరీఫ్ లక్ష్యాన్ని చేరుకునేవిధంగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఖరీఫ్‌లో 1.93 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతున్నాయని పేర్కొన్నారు.

వైద్య సేవలు మెరుగవ్వాలి

జిల్లాలో అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాలు కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందేలా వైద్య శాఖ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సింగ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బిజూ స్వస్థ్య కల్యాణ యోజన ముఖ్య సలహాదారుడు సుధీర్ దాస్ మాట్లాడుతూ జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ హాస్పిటల్‌లో చిల్డ్రన్స్ స్పెషలిస్టు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. అందువలన ఖాళీగా ఉన్నటువంటి వైద్య పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసేలా యంత్రాంగం నివేదికను సమర్పించాలని సూచించారు. రఘుబారి, డిమిరిగుడ ప్రాంతాలకు అంబులెన్స్‌లు వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అత్యవసర సమయంలో ఆయా ప్రాంతాలకు అంబులెన్స్‌లు చేరడం లేదన్నారు. ఈ విషయంపై జిల్లా ముఖ్యవైద్యాధికారి చర్యలు తీసుకోవాలన్నారు.

అందరికీ తాగునీటి సదుపాయం

వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి జిల్లాలోని 2,27,999 కుటుంబాలకు జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అందుకు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని వివరించారు. అనంతరం జిల్లాలో అత్యధిక శాతం మంది ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలలకు వెళ్లడం లేదని, ఏళ్ల తరబడి బదిలీలు జరగకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని డీఈవో పూర్ణచంద్ర భొరియా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సకాలంలో పాఠశాలలకు వెళ్లని ఉపాధ్యాయులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఇకపై ప్రతివారం ఉపాధ్యాయుల పనితీరుపై నివేదిక సమర్పించాలని, తదనుగుణంగా తాను చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. సమావేశంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, కొరాపుట్ లోకసభ ఎంపీ సప్తగిరి ఉలక ప్రతినిధిగా దుర్గాప్రసాద్ పండ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి నిహారి రంజన్ కుహారొ తదితరులు పాల్గొన్నారు.

‘సివిల్ కోర్టు ఏర్పాటు చేయాలి’



సంజీవ కుమార్ పాణిగ్రహికి సమస్యలు విన్నవిస్తున్న న్యాయవాదులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి కోట్‌పాడ్‌లో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు కోట్‌పాడ్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల ప్రతినిధి బృందం సభ్యులు కొరాపుట్ జిల్లా ఫోర్టు ఫోలియో విచారపతి సంజీవ కుమార్ పాణిగ్రహిని గురువారం కటక్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కేసులు వాదించేందుకు చత్తీష్‌ఘడ్ రాష్ట్ర సరిహద్దున ఉన్నటువంటి కోట్‌పాడ్ ప్రాంతం నుంచి దాదాపు 80 కిలోమీటర్ల దూరంలోని జయపురం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వలన సమయం వృథా, వ్యయం అధికమవుతున్నారని విన్నవించారు. దీనికి ఫోర్టు ఫోలియో విచారపతి సంజీవ కుమార్ పాణిగ్రహి స్పందించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మణి ప్రసాద్ పట్నాయక్, మాజీ అధ్యక్షుడు పంకజకుమార్ పాత్రో, కార్యదర్శి శంకర ప్రసాద్ పండ, ప్రభుత్వ న్యాయవాది కిశోర్ చంద్ర మిశ్ర, న్యాయవాదులు ముక్తేశ్వర నాయిక్, లింగరాజ్ నాయిక్, సంగ్రామ జెన, జగదీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో క్రీడల పోటీలు



బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



బాడ్మింటన్ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

భువనేశ్వర్: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) పలు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ టోర్నమెంట్ విజేతలకు మేజర్ ధ్యాన్‌చంద్ ట్రోఫీని బహూకరిస్తారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటారు. భారతీయ క్రీడా సంప్రదాయాన్ని పటిష్టపరిచే సత్సంకల్పంతో ఈ దినోత్సవం జరుపుకోవడం విశేషం. ఈ ఏడాది సమైక్య పటిష్ట సమాజం (స్పోర్ట్సు ఏన్ ఎనేబులర్ ఫర్ ఏన్ ఇన్‌క్లూజివ్ అండ్ ఫిట్ సొసైటీ) నినాదంతో జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈనెల 28వ తేదీన ఇంటర్ ఇయర్ క్రీడోత్సవం ముగుస్తుంది.

పర్లాకిమిడిలో జోరువాన



పర్లాకిమిడిలో జోరువాన పడుతున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. జిల్లాలో గుసాని, రాయఘడ ప్రాంతంలో వర్షాభావం వల్ల ఎండిపోతున్న వరిపైరుపై రైతుల ఆశలు చిగురించాయి.

నువాపడాలో మావోయిస్టుల దాడి

- దగ్ధమైన జేసీబీ



దగ్ధమైన జేసీబీ

భువనేశ్వర్: నువాపడా జిల్లా నువాపడా సదర్ మండలం కెర్మెలి పంచాయతీ పరిధిలోని గొలాబొంధా గ్రామంలో మావో దళాలు గురువారం రాత్రి అలజడి రేపాయి. గ్రామంలోని వన్యప్రాణి శాఖకు చెందిన ఫారెస్టర్ క్వార్టర్స్‌పై సాయుధ మావోయిస్టులు దాడి చేసి బాంబులు రువ్వారు. అటవీ శాఖ బీట్ హౌస్‌ను మావోయిస్టులు పేల్చివేసి జేసీబీ వాహనానికి నిప్పు పెట్టారు. అనంతరం ఈ ప్రాంతంలో పోస్టర్ ప్రదర్శించారు. ప్రభుత్వాలు ఈ ప్రాంతంలోని వనరులను నిలువునా దోచుకుని సామాన్య ప్రజలను వేధిస్తున్నాయని ఆరోపించారు. పరిస్థితులు చక్కదిద్దకుంటే చర్యలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ప్రదర్శించిన మావో పోస్టరు

గ్రానైట్ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ



కంపెనీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి మాఝిగూడ గ్రామంలో గ్రానైట్ తవ్వకాలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం మరియు శ్రీ భువనేశ్వరీ గ్రానైట్ డెకరేటివ్ సంస్థ సభ్యులు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు రహదారులు నిర్మిస్తామని, ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇళ్ల స్థలం, పంట పొలాలు నష్టపోయినవారికి నష్టపరిహారం అందజేస్తామని జిల్లా చీఫ్ నోడల్ అధికారిగా నియమితులైన మల్కన్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ త్రినాథ మాఝి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ అధికారి దినేష్ కుమార్ బిశ్వల్‌లు తెలిపారు. దీనికి గిరిజనులు స్పందించి క్వారీ ఏర్పాటు చేసేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని ప్రకటించారు. అయితే మరోవైపు జిల్లా కాంగ్రెస్ నాయకులు దీనిని వ్యతిరేకిస్తున్నారు. గ్రానైట్ కంపెనీని స్థాపిస్తే రామయాణం నాటి చరిత్ర ఉన్న అమ్మకూండకు ఇబ్బందులు వస్తాయని, పురాతన గిరిజన సాంప్రదాయాలు కనుమరుగైపోతాయని మండిపడ్డారు. అమాయక గిరిజనులకు మాయమాటలు చెప్పి కాలుష్యం పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు ఇప్పటికైనా ఆపాలన్నారు. అమ్మకూండకు గవర్నర్ గణేషీ లాల్ స్వయంగా వచ్చి అయోధ్యకు జలం తీసుకెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి సీతారాములు వనవాసం చేసిన చరిత్ర ఉందన్నారు. అటువంటి అపురూప ప్రదేశాలను నాశనం చేయాలనుకోవడం సరికాదని హితవు పలికారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

శ్రావణ మాసంలో ప్రధానమైన వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అష్టోత్తర శతనామావళి వివిధ రకాల పుష్పాలతో అర్చన చేశారు. ఇళ్లల్లో ముత్తయిదువులను పిలిచి వాయినాలు సమర్పించారు. పిండి వంటలు, పండ్లు, ఫలహారాలను అమ్మవారికి నివేదించారు. – సాక్షి నెట్‌వర్క్



రాయగడ: కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



రాయగడ: వరలక్ష్మీ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: శ్రీరామలింగేశ్వర మందిరంలో విశేష అలంకరణలో లలితాదేవి



పర్లాకిమిడి: శ్రీకన్యకా పరమేశ్వరీ మందిరంలో...



పర్లాకిమిడి: పాడుగు కోవెలలో మహిళల పూజలు

క్లుప్తంగా

29న క్రీడా ప్రతిభా పాఠశాలలకు అవార్డుల ప్రదానం

శ్రీకాకుళం అర్బన్: ఈ విద్యాసంవత్సరానికి గాను పాఠశాల క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ఐదు పాఠశాలలను విద్యాశాఖ క్రీడా ప్రతిభా పాఠశాలలుగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈనెల 29వ తేదీన ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం చేపట్టనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పై అంతస్తులో ఉన్న జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో ఈ అవార్డుల ప్రధానోత్సవం ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి జరగనుందని ఆయన తెలిపారు.

తూనికలు కచ్చితంగా ఉండాలి: జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: పీడీఎస్ బియ్యం సరఫరాలో గోదాముల్లో కచ్చితమైన తూనికలు ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. ఆయన శుక్రవారం పీడీఎస్ బియ్యం, ఇతర సరకుల సరఫరాపై సివిల్ సప్లై డీటీలు, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలు, రేషన్‌షాపులు డీలర్లతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బియ్యం షార్టేజీ, కొలతల్లో తేడాలపై వారంతా ఫిర్యాదు చేశారు. జేసీ మాట్లాడుతూ బియ్యం షార్టేజీలు లేకుండా చూడాలని గోదాముల అధికారులకు తెలిపారు. ఏ దశలోనూ తూకంలో వ్యత్యాసం ఉండడానికి వీల్లేదన్నారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీనివాసరావు, డీఎస్‌ఓ డీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన



గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై మాట్లాడుతున్న జడ్జి మల్లా చక్రధర్

కాశీబుగ్గ: బాలబాలికలంతా గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ను ముందస్తుగా గుర్తించాలని లేకుంటే హద్దులు దాటిపోతాయని జూనియర్ సివిల్ జడ్జి ఎఫ్ఏసీ పలాస మల్లా చక్రవర్తి అన్నారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఆడపిల్లలు చెప్పుకోలేని న్యాయపరమైన సమస్యలు ఉంటే భయపడవద్దని, తెల్లకాగితంపై రాసి మండల న్యాయ సేవా సంఘానికి దరఖాస్తు చేయాలని కోరారు. పోలీసులు, న్యాయవ్యవస్థ, ప్రభుత్వం ప్రజలను కాపాడేందుకే ఉన్నాయని అన్నారు. అదేవిధంగా సెప్టెంబరు 9వ తేదీన జరగబోవు జాతీయలోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ జీఎంఎస్ అనీల్‌రాజు, ఏపీపీ రమేష్, వేశ్వేశ్వరరావు, పిండి వెంకటరావు, ఘని, రజినికుమార్, చంద్రశేఖర్, శ్యాం, పాణిగ్రహి, కమీషనర్ నాగేంద్రకుమార్, ఎంఈఓ శ్రీనివాసరావు, తహశీల్దారు మధుసూదన్, ఎస్ఐ షేక్‌వాలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ 125వ జయంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: బీసీల నేత బీపీ మండల్ 125వ జయంతి కార్యక్రమాలు శుక్రవారం నగరంలోని జ్యోతీరావు పూలే పార్కు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల్ విగ్రహానికి బీసీ, ఎస్సీ, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పూలమాలలు వేసి, ఆయన సేవలు, ఆయన నివేదికలను గుర్తు చేసుకున్నారు. 56 శాతం ఉన్న బీసీలకు నేటికీ రాజ్యాధికారం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో 50 శాతం రాజ్యాధికారం కల్పించాలని కోరారు.

విద్యార్థులకు శిక్షణ



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బెంగళూరులోని కమిషనరేట్ ఆఫ్ కొలిజియట్ ఎడ్యుకేషన్, ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనీ చిన్మయి సాహు ఆధ్వర్యంలో 90 గంటల పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, జాబ్ రిలేటెడ్ టిప్స్, గ్రూప్ డిస్కసన్స్, రెజ్యూమ్ రైటింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు.

గొర్రెలు మృత్యువాత

టెక్కలి: మండలంలోని లింగాలవలస గ్రామంలో 9 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన మట్ట నీలయ్య అనే గొర్రెల యజమాని గురువారం సాయంత్రం తన పశువుల శాలలో గొర్రెలను ఉంచగా, శుక్రవారం ఉదయం చూస్తే 9 చూడి గొర్రెలు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న పశు వైద్యాధికారులు ఆయా గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. నిరుపేద యాదవ కుటుంబానికి చెందిన నీలయ్యకు చెందిన గొర్రెలు మృత్యువాత పడడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాడని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ సంపతిరావు లక్ష్మి కోరారు.

సాగర తీరానికి ప్రగతి హారం



- జిల్లాలో బీచ్‌ల అభివృద్ధికి ప్రణాళికలు
- 11 మండలాల్లో 67 బీచ్‌ల గుర్తింపు
- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పర్యాటక సౌకర్యాలతో బీచ్‌ల అభివృద్ధి
- రాష్ట్రంలో అత్యధిక బీచ్‌లున్న జిల్లాగా శ్రీకాకుళం

అరసవల్లి: సిక్కోలు సాగర తీరానికి అభివృద్ధి హారం పడనుంది. ఎప్పుడూ చూస్తున్న తీర ప్రాంతాలే అయినా మునుపటి రూపు మార్చుకుని కొత్త కళతో పర్యాటకులకు ఆకర్షించేలా పర్యాటక శాఖ ప్రణాళికలు రచిస్తోంది. రాష్ట్రంలో అత్యంత పొడవైన తీర ప్రాంతం గల మన జిల్లాలో బీచ్‌లు అంతగా అభివృద్ధికి నోచుకోలేదు. తాజాగా తీర ప్రాంతాల అభివృద్ధికి పర్యాటక శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. 2019లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన కోస్టల్ జోన్ రెగ్యులేషన్ నోటిఫికేషన్‌కు లోబడి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు 11 మంది ప్రత్యేక అధికారులతో కూడిన బృందం ఇటీవలే పర్యటించి జిల్లాలో మొత్తం 67 బీచ్‌లను బాగు చేసేందుకు గుర్తించింది. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయిలో పర్యాటక కౌన్సిల్ సమావేశమై ఈ తీరాలను అభివృద్ధి చేసేందుకు ఆమోదించారు. వీటి అభివృద్ధితో తీరప్రాంతాల్లో చేపల ఉత్పత్తి, మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బందులు లేని రీతిలో పర్యావరణ అనుకూల బీచ్‌లను తీర్చిదిద్దనున్నారు.

అత్యధికంగా మన జిల్లాలోనే..

రాష్ట్రంలో బీచ్‌ల అభివృద్ధికి పర్యాటక శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. అయితే ఈ క్రమంలో ప్రత్యేక అధికారుల బృందం పర్యటించి పలు ప్రాంతాల్లో బీచ్‌ల అనుకూల ప్రతికూల అంశాలను పరిగణనలోకి తీసుకుని తుదిగా జిల్లాలో 67 వరకు బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు గుర్తించారు. ఇలాగే రాష్ట్రంలో 12 జిల్లాలో 363 బీచ్‌లను గుర్తించగా, అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలోనే అధిక బీచ్‌లను గుర్తించారు. తర్వాత పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 63 బీచ్‌లు, తర్వాత అనకాపల్లి జిల్లాలో 35 బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు నివేదించారు. అయితే రాష్ట్రంలో 8 బ్లూఫ్లాగ్ బీచ్‌లను గుర్తించగా.. ఇందులో మాత్రం మన జిల్లాలో ఒక్క బీచ్‌కు కూడా అంతటి ప్రమాణాలు లేవని కమిటీ తేల్చింది. బ్లూఫ్లాగ్ బీచ్‌లంటే... 33 ప్రమాణాల ఆధారంగా ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సంస్థ ధ్రువీకరణ చేయాల్సి ఉంటుంది.





అనుమతులు రాగానే పనులు

రాష్ట్రంలో మన జిల్లాకు ప్రత్యేకత ఉంది. అత్యధికంగా 67 బీచ్‌లను గుర్తించి అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారుకు ప్రతిపాదించాం. కోస్టల్ పర్యాటకులను ఆకర్షించేలా ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను కేటాయించనున్నాయి. అయితే ఈ మేరకు అభివృద్ధికి పర్యావరణ అనుమతులు రాగానే పనులు ప్రారంభించనున్నాం. – ఎన్.నారాయణరావు, జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖాధికారి



ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో బీచ్ ఇదే

జిల్లాలో గుర్తించిన బీచ్‌లు ఇవే...

శ్రీకాకుళం: కుందువానిపేట, గనగళ్లవానిపేట.
గార: బలరాంపురం, కళింగపట్నం, శ్రీకూర్మం (మత్స్యలేశం), మొగదాలపాడు, కొమరివానిపేట, బందరువానిపేట, కె.మత్స్యలేశం
ఎచ్చెర్ల: బడివానిపేట, బుడగట్లపాలెం-1, బుడగట్లపాలెం2, డి.మత్స్యలేశం, రాళ్లపేట, కె.మత్స్యలేశం,శివాజీ దిబ్బలపాలెం, కొత్త దిబ్బలపాలెం, పాత దిబ్బలపాలెం.
రణస్థలం: పోతయ్యపాలెం, అల్లివలస, జీడిపాలెం, కొవ్వాడ, చీకటివానిపేట, దోనిపేట, గురయ్యపేట.
పోలాకి:రాజరామపురం, పెద్దకొవిరిపేట, జోగంపేట, కొత్తరేవు,గొల్లవానిపేట, గుప్పిడిపేట.
మందస: ఎం.గంగువాడ, గద్దేరు, భేతాళపురం, రట్టి.
సోంపేట: బారువ, రామయ్యపట్నం, ఇసుకలపాలెం, బట్టిగల్లూరు, ఎకువూరు, సిహెచ్. గొల్లగండి.
కవిటి: కపాసుకుద్ది, పుక్కళ్లవానిపాలెం, కొత్తపాలెం,చిన్నకర్రివానిపాలెం, పెద్దకర్రివానిపేట, ఇద్దువానిపా లెం, కొత్తకళింగపట్నం (ఒంటూరు), బట్టివానిపాలెం.
ఇచ్ఛాపురం: డొంకూరు.
వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేట, డొంకులపాడు, కంబాలరాయుడుపేట, అక్కుపల్లి, గుణుపల్లి, నువ్వలరేవు, హుకుంపేట, తొట్టూరు, దేవునల్తాడ, కొత్తపేట.
సంతబొమ్మాళి: భావనపాడు, గెద్దలపాడు, ఎం.సున్నాపల్లి, పిట్టవానిపేట, కుందువానిపేట, పాతమేఘవరం, మరువాడ.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

- స్కూటీని ఢీకొట్టిన ఎక్స్‌ప్రెస్
- అక్కడికక్కడే యువతి మృతి



ఇప్పిలి కల్యాణి (ఫైల్)



కుమార్తె మృతదేహం చూసి విలపిస్తున్న తండ్రి బాలరాజు

కాశీబుగ్గ: పలాస మండలం సరియాపల్లి పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇప్పిలి కల్యాణి(20) అనే యువతి దుర్మరణం పాలైంది. వివరాల్లోకి వెళ్తే.. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వ వార్డు శివాజీనగర్‌లో నివాసం ఉంటున్న ఇప్పిలి కల్యాణి అలియాస్ శిల్ప (20) శ్రావణ శుక్రవారం సందర్భంగా వేకువజామున తల్లితో పాటు వ్రతం ఆచరించింది. వివిధ రకాల ప్రసాదాలను తయారుచేసి చుట్టుపక్కలవారికి పంచిపెట్టింది. కాశీబుగ్గ గాంధీనగర్‌లో డాక్టర్ పొందల జగదీష్ నడుపుతున్న శ్రీకృష్ణా ఆస్పత్రిలో ఆమె ఫిజియోథెరపిస్టుగా పని చేస్తోంది. పేషెంట్ నుంచి కాల్ రావడంతో ఆమె వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి గ్రామానికి వెళ్లేందుకు తన స్కూటీపై బయల్దేరింది. సరియాపల్లి పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి విశాఖ-ఇచ్ఛాపురం ఎక్స్‌ప్రెస్ బస్సు ఆమె స్కూటీని ఢీకొట్టింది. తలపై పెద్ద దెబ్బ తగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ పరారైపోయాడు.

మృతురాలిది పలాస పురుషోత్తపురం స్వగ్రామం కాగా శివాజీనగర్‌లో అద్దె ఇంటిలో ఉంటున్నారు. ఆమె తండ్రి ఇప్పిలి బాలరాజు జీడి కార్మికుడిగా పనిచేస్తుండగా తల్లి ఇప్పిలి పుణ్యావతి జీడి కార్మికురాలుగా రోజువారీ కూలి పనిచేస్తుంటారు. సోదరుడు ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. వేకువనే లేచి అమ్మవారికి పూజ చేసి లక్ష్మీదేవిలా కనిపించిన కుమార్తె గంటల వ్యవధిలో ఇలా విగతజీవిగా కనిపించడంతో ఆమె తండ్రి గుండెలవిసేలా రోదించారు. ఫోన్‌కాల్ రావడమే తన బిడ్డపాలిట మృత్యువుగా మారిందని ఆయన కన్నీరుమున్నీరయ్యారు. నలభై రోజుల కిందటే ఆమె కొత్త స్కూటీ తీసుకోవడం గమనార్హం. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు చేశారు.

ఆస్పత్రులు భద్రం



ఆస్పత్రిలోని అన్ని కెమెరాల విజువల్స్ టీవీలో కనిపిస్తున్న దృశ్యం

- జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- ఆస్పత్రుల భద్రత, పరిశుభ్రతపై పర్యవేక్షణ
- ముఖ్యమైన వార్డులు, వైద్యపరీక్షలు, మందులు, ఓపీల వద్ద ఏర్పాటు



మేల్ విభాగంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

కాశీబుగ్గ: ప్రభుత్వ ఆస్పత్రుల భద్రత, పరిశుభ్రతపై పర్యవేక్షణ సులభం చేసేందుకు జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే నాడు-నేడుతో ప్రభుత్వ ఆస్పత్రులను ప్రభుత్వం బాగు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు సర్కారు ఖర్చు చేస్తున్న ప్రతి పైసా ప్రజలకు సేవల రూపంలో అందించాలనే ఉద్దేశంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఇప్పటికే పలు చోట్ల ఉండగా, మిగిలిన చోట్ల కూడా కెమెరాలు పెట్టి ప్రజలకు అన్ని సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనేది పర్యవేక్షించనున్నారు.

డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు జిల్లాలోని సీహెచ్‌సీలు, జిల్లా కేంద్ర ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు అమర్చారు. శ్రీకాకుళం రిమ్స్‌లో ఇప్పటికే కెమెరాలు ఉన్నాయి. ఆస్పత్రికి ఎవరు వచ్చి వెళ్లారు, ఉద్యోగులు, వైద్యులు ఎన్నింటికి వచ్చారు, ఎన్నింటికి వెళ్లారు, ఓపీ, మందులు వద్ద సేవలు ఎలా ఉన్నాయో పరిశీలిస్తున్నారు. ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా డీసీహెచ్ఎస్ కంట్రోల్‌లో ఉన్న 13 కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ల(సిహెచ్‌సి)లో సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు.

కొత్తవి, పాతవి..

టెక్కలి జిల్లా ఆస్పత్రి, నరసన్నపేట ఏరియా ఆస్పత్రి, పలాస, రణస్థలం, పాతపట్నం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఉన్నాయి. తాజాగా ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, బారువ, హరిపురం, కోటబొమ్మాళి, బుడితి, ఆమదాలవలస, పొందూరు, కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనున్నారు.

16 చోట్ల ఉన్నాయి..



పలాస సామాజిక ఆస్పత్రిలో 16 చోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయి. ఆస్పత్రికి అంబులెన్సులు, ఇతర వాహనాల రాకపోకల కోసం ఇన్‌గేటు, అవుట్ గేట్ మొదలుకొని ఆస్పత్రిలోని ప్రధాన గదులు, అన్ని విభాగాల వద్ద ఏర్పాటు చేశాం. శవాగారం వద్ద సైతం ఎలాంటి మిస్సింగ్స్ అవ్వకూడదని పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నాం. సీసీ కెమెరాలు ఉన్నాయనే భయంతో జాగ్రత్తగా మెలుగుతున్నారు.

– డాక్టర్ అగ్గున మేఘన, జనరల్ మెడిసిన్, సూపరింటెండెంట్, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి, పలాస

సమస్యలు తీరాయి



ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల చాలా సమస్యలు తీరాయి. అసాంఘిక శక్తుల అరాచకాలు పూర్తిగా కట్టటయ్యాయి. వైద్య సిబ్బంది వచ్చే సమయం, ఓపీ వద్ద పరిస్థితులు సులభంగా తెలుస్తున్నాయి. ప్రజలకు చక్కనైన సేవలు అందించేందుకు మేలు జరుగుతుంది.

– డాక్టర్ జె.భాస్కరరావు, డిసిహెచ్ఎస్, శ్రీకాకుళం

పాఠశాలల్లో వ్యాయామ విద్యకు పెద్దపీట



పాఠశాలల పీడీలు, పీఈటీల సమావేశం

శ్రీకాకుళం అర్బన్: పాఠశాలల్లో క్రీడలకు, వ్యాయామ విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. తాజాగా అమల్లోకి వచ్చిన విధి విధానాలు, వివిధ అంశాలపై విరివిగా వ్యాయామ ఉపాధ్యాయులకు సమావేశాలను నిర్వహించి పలు సూచనలు చేసే విధంగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ ఉపాధ్యాయులకే పరిమితమైన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ ఇకపై వ్యాయామ ఉపాధ్యాయులకు కూడా నిర్వహించాలని నిర్ణయించింది. తాజాగా పాఠశాల విద్య కమిషనర్ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

నియోజకవర్గాల వారీగా సమావేశాలు

వాస్తవానికి ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు మండలాల వారీగా నిర్వహిస్తున్నారు. అయితే వ్యాయామ ఉపాధ్యాయులకు మాత్రం నియోజకవర్గాల స్థాయిలో ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల్లో సమావేశాల్లో నిర్వహించనున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీ నుంచి వ్యాయామ ఉపాధ్యాయులకు కూడా మొదటిసారిగా పీడీ/పీఈటీలకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ సమావేశాలకు ఆయా నియోజకవర్గాల పరిధిలో ఉన్న అన్ని యాజమాన్య పాఠశాలల పీడీ, పీఈటీలు విధిగా హాజరు కావాల్సి ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలలో ఈ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వ హైస్కూల్ (ఇచ్ఛాపురం), పలాసలోని ప్రభుత్వ హైస్కూల్ (పలాస), టెక్కలిలోని ప్రభుత్వ హైస్కూల్ (టెక్కలి), నరసన్నపేట జెడ్పీ హైస్కూల్ బోర్డు(నరసన్నపేట), పాతపట్నం ప్రభుత్వ హైస్కూల్(పాతపట్నం), ఆమదాలవలస ప్రభుత్వ హైస్కూల్(పాతపట్నం), ఎచ్చెర్ల ప్రభుత్వ హైస్కూల్(ఎచ్చెర్ల), శ్రీకాకుళం నియోజకవర్గంలోని ఎన్‌టీఆర్ ఎంహెచ్ స్కూల్(శ్రీకాకుళం)లలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేత్రదానంపై అవగాహన కల్పిద్దాం

అరసవల్లి: జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ఈనెల 25 నుంచి వచ్చే నెల 8 వరకు జిల్లాలో జరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు నేత్రదానాలపై అవగాహన కల్పిద్దామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి పిలుపునిచ్చారు. కార్నియల్ అంధుల్లో చూపును నేత్రదాతల ద్వారా మాత్రమే ప్రసాదించవచ్చునని, ఎవరైనా కుటుంబ సభ్యులు మరణిస్తే.. వారి కళ్లు సజీవంగా మరొకరికి చూపునిచ్చేలా నేత్రదానాలను ప్రోత్సహించేలా ఈ పక్షోత్సవాల్లో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వైఎస్సార్ కంటివెలుగు శిబిరాల్లో ఈ నేత్రదానాలపై విస్తృతంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు.

అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారిగా పనిచేసేందుకు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారిగా పనిచేసేందుకు ఆసక్తి చూపే ఉపాధ్యాయులు కంప్యూటర్ పరిజ్ఞానం(ఎంఎస్ ఆఫీస్, స్ప్రెడ్ షీట్‌లు, గూగుల్ ఫారమ్‌లు, మెయిల్ మెర్జింగ్) తెలిసి ఉండాలని, జిల్లాలో పనిచేస్తున్న ఆసక్తిగల స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్) ఉపాధ్యాయుల నుంచి ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో స్వీకరిస్తామని పేర్కొన్నారు.

సరుబుజ్జిలిలో పులి జాడలు

సరుబుజ్జిలి: స్థానిక గవర్నమెంట్ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం అర్ధరాత్రి పులి సంచరించినట్లు పాదముద్రలు కనిపించాయని కాలేజీ అధ్యాపకులు చెబుతున్నారు. ఇటీవల సరుబుజ్జిలి, ఎల్ఎన్ పేట మండలాల్లోని అమృత లింగానగరం, జంబాడ ప్రాంతాల నడుమ పులి సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారుల పరిశీలనలో తేలింది. ఇప్పుడు మళ్లీ సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పులి పాదముద్రలు కనిపించడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

'అప్రమత్తంగా ఉండాలి'

ఎల్.ఎన్.పేట: సరుబుజ్జిలి అటవీ శాఖ పరిధిలో పులి సంచారంపై కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని సరుబుజ్జిలి ఫారెస్టు సెక్షన్ అధికారి ఎల్.ధర్మారావు అన్నారు. మండలంలోని జంబాడ, మురగడలోవ, సూదిరాయిగూడ తదితర గిరిజన గ్రామాల్లో శుక్రవారం గిరిజనులకు అవగాహన క ల్పించారు.

పేరు మారినా.. తీరు మారునా!

- ముగ్గురి వద్ద రూ. 12.70 లక్షలకు టోపీ వేసిన ఘనుడు
- స్మార్ట్ యోజన నుంచి రూరల్ డెవలప్‌మెంట్‌గా పేరు మార్చిన వైనం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

స్మార్ట్ యోజన అసిస్టెంట్ జాబ్‌ల పేరుతో మోసం



సాక్షిలో ప్రచురితమైన కథనాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రెండేళ్ల కిందట ఓ పేరు.. ఇప్పుడు మరో పేరు. పేరొక్కటే మారింది. తీరు మాత్రం అదే. స్మార్ట్ యోజన పేరుతో ముగ్గురిని మోసం చేసి రూరల్ డెవలప్‌మెంట్ పేరుతో వారిని ఏమార్చడానికి ప్రయత్నించిన వైనం ఆలస్యంగా వెలుగుచూసింది. జిల్లా కేంద్రంలో ఉద్యోగాల పేరిట ముగ్గురి నుంచి రూ.12.70 లక్షలు వసూలు చేసి టోకరా వేశాడో ఘనుడు. స్మార్ట్ యోజన అసిస్టెంట్లు పేరిట ఉద్యోగాల ఆర్డర్లు ఇచ్చి మూడు నెలలు పనిచేయించుకుని ఆఖరుకు కార్యాలయాన్నే మూసేశాడు. ఇప్పుడేమో రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్లుగా కొత్త ఆర్డర్‌లు ఇచ్చి జాబ్ చేయమంటున్నారు. దీనిపై విసిగిపోయిన బాధితులు ఈ నెల 20న ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్‌ను ఆశ్రయించారు. ఎస్ఐ గణేష్ తెలిపిన వివరాల మేరకు..

నగరంలోని కాకివీధికి చెందిన రజిని అనే మహిళకు ఆమె ఇంటి ఓనర్ ద్వారా పతివాడ యుగంధర్ అనే వ్యక్తి చాలాకాలం కిందట పరిచయమయ్యారు. ఈ క్రమంలో యుగంధర్ ఆమెతో మాట్లాడుతూ గుండ బాలామోహన్ అనే వ్యక్తి తన భార్యకు సెంట్రల్ గవర్నమెంట్ ప్రాజెక్టు వర్క్‌లో జాబ్ ఇప్పించాడని, కొద్దిగా డబ్బులు కడితే మీకు కూడా ఇప్పిస్తానని చెప్పాడు. ఇంటి వద్దనే పని ఉంటుందని నెలకు రూ.19,200 జీతం అని చెప్పడంతో ఆమె 2021 నవంబరులో రూ.1.50 లక్షలు ఒకసారి, రూ.2 లక్షలు మరొక సారి.. డిసెంబరులో మరో రూ.70 వేలు కలిపి మొత్తంగా రూ. 4.20 లక్షలు యుగంధర్ చేతిలో పెట్టి గుండ బాలామోహన్‌కు ఇప్పించారు. దీనికి ప్రతిగా బాలమోహన్ నుంచి తేదీ వేయనివి మూడు బ్యాంకు చెక్కులు ఇచ్చారు. 2022 మేలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఆమెకు స్మార్ట్ యోజన అసిస్టెంటుగా ఆఫర్ లెటర్ ఇచ్చారు.

ఇంత వరకు అంతా సవ్యంగానే జరిగినా కొలువులో చేరిన తర్వాత ఆమెకు అసలు విషయం అర్థమైంది. ఆఫీసుకు వెళ్లిన మొదటి రోజే జీతం రూ.19వేలు కాదు రూ.13 వేలే అన్నారు. పని ఇంటిలో కాదు ఫీల్డ్‌లో అని చెప్పారు. జీతం కూడా అన్నదాత ప్రాజెక్టు ఈ-కార్డులు చేస్తేనే కార్డుకు రూ.90 లెక్కన పడతాయని చెప్పారు. ఇన్ని చెప్పాక కొన్నాళ్లకు ఆ కార్యాలయాన్నే మూసేశారు. అడిగితే కొద్ది రోజుల తర్వాత తెరుస్తామంటూ చెప్పారు. మళ్లీ 2023లో స్మార్ట్ యోజన పేరును తీసేసి రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ పేరుతో అసిస్టెంట్‌గా ఆర్డర్ ఇచ్చారు.

ఈమె మోసపోయిన విధంగానే కాకివీధిలోనే నివసిస్తున్న పి.కృష్ణమోహన్ రూ.4.50లక్షలు, రాజాంకు చెందిన పౌరోహిత్యం చేస్తున్న సంతోష్ సూర్యనారాయణ రూ.4 లక్షలు గుండ బాలామోహన్‌కు ఇచ్చి మోసపోయారు.

ఎవరీ బాలామోహన్..?

గుండ బాలామోహన్ ఒకప్పుడు పీడీగా పనిచేశారు. ప్రస్తుతం నగరంలోనే లిఖిత జాబ్ కన్సల్టెన్సీ నడుపుతున్నారు. జిల్లా కేంద్రంలో స్మార్ట్ యోజన పేరిట కార్యాలయం నడిపారు. అది కాస్తా మూసేసి మళ్లీ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ పేరిట కార్యాలయం తెరిచారు. పేరుకే ఆఫీసు.. కానీ ఓ బోర్డు ఉండదు.. అందులో మనుషులు ఉండరు. అయితే ఇతని పైన మరో ఇద్దరు ఉన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

తిరిగి బాధితులపైనే నోటీసులు..

మొదటిసారి మోసపోయి రెండోసారి నమ్మకం కుదరక బాధితులంతా తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని బాలామోహన్‌ను అడిగారు. అందరి వద్దా వివరాలు తీసుకుని ఆ తర్వాత ఆయన ఫోన్ ఎత్తడం మానేశారు. ఇదంతా ఒక ఎత్తయితే.. జూలై 27న గుండ బాలమోహన్ తాను తన లిఖిత జాబ్ కన్సల్టెన్సీ పేరుతో జాబ్‌లు వేయించినా ఫీజు ఇవ్వలేదంటూ పైన పేర్కొన్న బాధితులకు లాయర్ నోటీసులు పంపడం మరో ఎత్తు. ఇదేంటని పతివాడ యుగంధర్‌కు బాధితులు అడగ్గా.. తనకేం సంబంధమంటూ తప్పుకున్నాడు. దీంతో మంత్రి ధర్మాన వద్దకు బాధితులు వెళ్లగా మంత్రి పీఏ ఒకటో పట్టణ ఎస్ఐ గణేష్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించమన్నారు. దీంతో ఎస్ఐ బలివాడ గణేష్ ఈ నెల 20 న కేసు నమోదు చేశారు. దీనిపై ఎస్ఐని 'సాక్షి' వివరణ కోరగా ఫిర్యాదు రావడం మాట వాస్తవమని, మోసం చేశారన్న వ్యక్తులను ఇప్పటికే పిలిపించి మాట్లాడామని, వారి పైన కొందరు వ్యక్తులు ఉన్నారని చెప్పారని, దీనిపై విచారణ చేస్తున్నామని చెప్పారు.

ఇ'స్మార్ట్' వేషాలను రెండేళ్ల క్రితమే వెలుగులోకి తెచ్చిన సాక్షి..

మాయల మరాఠీల అక్రమాలపై ప్రజల్ని రెండేళ్ల క్రితమే 'సాక్షి' అప్రమత్తం చేసింది. మాయగాళ్లు నిరుద్యోగుల నమ్మేలా ఓ మాయా ప్రపంచాన్నే సృష్టించిన వైనాన్ని వెలుగులోకి తెచ్చింది. వెబ్‌సైట్‌లో ఓ నెట్‌వర్క్ లింక్‌ను ఎరగా చూపి, నిరుద్యోగులను తన మాయలో పడేశారో కథనాల రూపంలో ప్రచురించి అప్రమత్తం చేసింది. ఈ క్రమంలో కేటుగాళ్లు 'సాక్షి' ప్రతినిధిని చంపేస్తామంటూ వీడియోలు విడుదల చేసి బెదిరించారు కూడా.

